క్లుప్తంగా

అంజన్నకు ప్రత్యేక పూజలు


అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

పర్యావరణాన్ని రక్షించుకుందాం


అడవిగొల్లపల్లి ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న ఎఫ్‌బీఓ శ్రీనాథ్

శెట్టూరు: మొక్కలునాటి పర్యావరణాన్ని రక్షించుకుందామని శెట్టూరు, కళ్యాణదుర్గం ఎఫ్‌బీఓలు శ్రీనాథ్, నాగేనాయక్ అన్నారు. శనివారం మండలంలోని అడవిగొల్లపల్లి ఫారెస్ట్‌లో 'లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టులో మొక్కలు నాటారు. అనంతరం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీవన విధానంలో మొక్కల పాత్ర, ప్రాముఖ్యత వివరిస్తూ, జీవ వైవిధ్యంలో మొక్కలు, గాలి, నేల, నీరు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

కూడేరు: స్టేట్ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులు ఆయా గ్రామాలకు కేటాయించిన తేదీల్లో రెన్యూవల్ చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ బ్యాంక్ పరిధిలో మొత్తం 2,200 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకూ సుమారు 450 మంది రైతులు రెన్యూవల్ చేసుకున్నారన్నారు. సిబ్బంది రైతుల వద్దకే వచ్చి డాక్యుమెంట్లు, సంతకాలు తీసుకుంటారన్నారు. లోన్ తీసుకున్న ఏడాదిలోపు రెన్యూవల్ చేసుకుంటే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని ఆయన తెలిపారు.

మురుగు సమస్య పరిష్కరించండి


కూడేరు:ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద రహదారిపైకి వచ్చిన మురుగు

కూడేరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద డ్రైనేజీ నుంచి అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపైకి వస్తున్న మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. డ్రైనేజీని అసంపూర్తిగా ఏర్పాటు చేయడంతో మురుగు ముందుకు ప్రవహించకుండా బయటకు వచ్చి ఇళ్ల ముందు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందన్నారు. రహదారిపైకి నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీకి అదనంగా సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.


ఆహ్లాదకర ప్రయాణం!


దేవరెడ్లపల్లి క్రాస్ నుంచి రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు

గుమ్మఘట్ట: అనంతపురానికి వెళ్లే ప్రధాన రహదారిలో దేవరెడ్లపల్లి క్రాస్ నుంచి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లను పెంచడంతో ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. రోడ్డు కిరువైపులా వేప, కానుగ, సుబాబుల్, సిలకేసరి, సీమ కానుగ చెట్లను నాటి పెంచడంతో పచ్చగా కళకళలాడుతూ నీడను ఇస్తూ చల్లని గాలిని అందిస్తుండడంతో రోడ్డుపై వెళ్లే పాదాచారులు, వాహనదారులు సైతం సంతృప్తికి లోనవుతున్నారు. రోడ్లు కిరువైపులా గతంలో నాటిన చెట్లను నరకకుండా గ్రామస్తులు కంటికి రెప్పలా కాపాడుకోవడంలో ముఖ్యభూమిక పోషించడంతో పలుగ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలలు

- 'దుర్గం'లో కార్పొరేట్ దోపిడీ
- అడ్మిషన్లు చేయించాలని వెంటపడుతున్న వైనం
- ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలలవైపే మొగ్గు



☛ పట్టణానికి చెందిన ఓ కార్పొరేట్ పాఠశాల బృందం అడ్మిషన్ల కోసం ఇటీవల ఓ వ్యాపారి ఇంటి వద్దకెళ్లారు. తమ పాఠశాలలో నాణ్యమైన సిలబస్ ఉంటుంది, పిల్లాడిని పంపితే ఉద్యోగం కచ్చితంగా సాధిస్తాడని నమ్మించే ప్రయత్నం చేశారు. ఎంత బతిమాలినా ప్రభుత్వ బడికే పంపుతాం. అక్కడన్నీ ఉచితంగా ఇస్తారని చెప్పి పంపారు.

☛ నాలుగో తరగతిలో అడ్మిషన్ కోసం పిల్లడితో కలసి తండ్రి ఓ కార్పొరేట్ బడికెళ్లాడు. అక్కడ రూ.40 వేలు అవుతుందని చెప్పగానే కంగుతిని వెనుతిరిగాడు. ఇలా ఈ ఇద్దరే కాదు చాలా మంది కార్పొరేట్ పాఠశాలలకెళ్లి ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.

రాయదుర్గం: కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గంలో కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 20కి పైగా ఉండగా, ప్రస్తుత ఏడాది మరిన్ని పెరగనున్నాయి. తమ పాఠశాల గొప్పదంటే కాదు.. తమ పాఠశాలలో సీబీఎస్ సిలబస్ ఉందంటూ అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రుల వెంటపడి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. మాయమాటలు చెప్పి ఫీజుల దోపిడీకి తెరలేపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెలవుల్లోనే అడ్మిషన్లన్ని పూర్తి చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రతి పాఠశాలలో 25 శాతం పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలనే నిబంధనలను సైతం తుంగలో తొక్కేస్తున్నారు. ఎల్‌కేజీ ప్రవేశాలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలను బట్టి ఫీజులు మరింత ఎక్కువగా చెబుతున్నారు. రవాణా సౌకర్యం, యూనిఫాం, ప్రత్యేక రోజుల్లో నిర్వహించే సాంస్కృతి కార్యక్రమాలు, పరీక్షల రుసుం తదితర వాటికి అదనంగా ఫీజులు గుంజుతున్నారు. వెరసి ఒకటో తరగతి చదివే విద్యార్థికి ఏడాదికి రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సిన దుస్థితి. మొదట్లో తక్కువ ఫీజులతో అడ్మిషన్లు చేయించుకుని ఏవేవో కారణాలు చూపి ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

చర్యలు శూన్యం

ప్రభుత్వ నియమ నిబంధనలను కార్పొరేట్ పాఠశాలలు తుంగతో తొక్కుతున్నా చర్యలు చేపట్టాల్సిన అధికారులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. పాఠశాల భవనాల విషయంలోనూ నిబంధనలు పాటించకపోగా, నైపుణ్యత లేనివారితో బోధన సాగిస్తున్నారనే విమర్శలు సైతం ఎక్కువయ్యాయి. మరోవైపు యూనిఫాం కూడా తామే ఇస్తామని.. పుస్తకాలు బయట కొనుక్కోవద్దని ఇలా యాజమాన్యాలు వాటికి బహిరంగ మార్కెట్ కంటే అదనంగా వసూళ్లు చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టడంతో పాటు ఫీజుల నియంత్రణ పై చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో అన్నీ ఉచితమే..

ప్రభుత్వ బడుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చారు. నాణ్యమైన విద్యా బోధనతో పాటు అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆంగ్లబోధన, విద్యాకానుక, విద్యాదీవెన, వసతిదీవెన లాంటి గొప్ప పథకాలతో అన్ని ఉచితంగా అందిస్తున్నారు. నాడు–నేడు కార్యక్రమంతో కార్పొరేట్‌ను తలదన్నేలా పాఠశాల భవనాలు రూపుమారాయి. నాణ్యమైన మెనూతో కూడిన మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ఇటీవల విడుదలైన పది. ఇంటర్‌లోనూ ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులే సత్తా చాటారు. సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తుకు చక్కని మార్గం లభిస్తోందని ప్రభుత్వ బడుల్లోని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు లోబడే పనిచేయాలి. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాకే అడ్మిషన్లు మెదలుపెట్టాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలకు అవకాశం కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య లభిస్తుండడంతో సద్వినియోగం చేసుకోవాలి. ఈ దిశగా అవగాహన కల్పిస్తున్నాం.

– నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం

కల్కీ ఆలయంలో సాధన తరగతులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు వద్ద ఉన్న కల్కీ ఆలయంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సాధన తరగతులు నిర్వహించారు. ప్రమద దాసాజీ, ఇందిరా దాసాజీ ఆధ్వర్యంలో హాజరైన కల్కీ భక్తులకు ఇహం, పరం గురించి వివరించారు. కార్యక్రమంలో కల్కీ సేవా సమితి సభ్యులు ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ, జయంతి రమేష్, నరసింహప్రసాద్, కౌన్సిలర్ దేవరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో అధిక దిగుబడి

కుందుర్పి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరుణంలో మెట్ట భూములను దుక్కులు చేయడంతోపాటు, సేంద్రియ ఎరువుల వాడకంతో రైతులు ఆశించిన దిగుబడులు సాధించేందుకు ఆస్కారముందని వ్యవసాయ అధికారి మహేష్, ఆర్బీకే సిబ్బంది సూచించారు. శనివారం మండలంలోని బొమ్మాజిపల్లిలో రైతులకు భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువుల వాడకం, వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. అలాగే విత్తన వేరుశనగ విత్తనం అవసరమైన రైతులు సోమవారం నుంచి ఆర్‌బీకేల్లో రిజిష్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జూన్ 1 నుంచి ప్రభుత్వం విత్తన వేరుశనగ పంపిణీ చేస్తుందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో రైతులు పొలాల్లో సామూహిక మంటలు వేసి చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రాత్రిళ్లు సామూహిక మంటలు వేయడం ద్వారా చీడపీడలు, రెక్కపురుగులు, పంటలకు కీడుచేసే పురుగులు మంటల్లో పడి చినిపోతాయన్నారు.కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా సిమెంట్ రోడ్డు పనులు


కణేకల్లులోని మెయిన్‌రోడ్డులో సిమెంటు రోడ్డు వేస్తున్న దృశ్యం

కణేకల్లు: పట్టణంలో సిమెంటు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మెయిన్‌రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉండేది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. గత నెల 30న విప్ కాపు సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 40 ఎం.ఎం. కంకర, వెట్‌మిక్స్‌తో తొలుత రోడ్డును పటిష్టీకరించి.. అనంతరం సిమెంటు రోడ్డును నిర్మిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ సిమెంటు రోడ్డును నాణ్యతతో నిర్మిస్తున్నారు. వారంలోపు పనులు పూర్తికానున్నట్లు అధికారులు తెలిపారు. మండల హెడ్ క్వార్టర్‌లో గుంతలతో అధ్వాన్నంగా ఉన్న మెయిన్ రోడ్డు మరికొన్ని రోజుల్లో కొత్తరూపును సంతరించుకోనుంది. ఈ రోడ్డు నిర్మాణంతో ప్రయాణం సాఫీగా సాగడంతో పాటు ఇన్నాళ్లు దుమ్ము, ధూళితో ఎదుర్కొంటున్న డస్ట్ అలర్జీ సమస్య కూడా ఉండదని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జలకాలాటలలో.. ఏమి హాయిలే!


కళ్యాణదుర్గం: బావిలో ఈత కొడుతున్న యువకులు


గుమ్మఘట్ట: బీటీపీ సాగునీటి కాలువలో సేదతీరుతున్న యువకులు

కళ్యాణదుర్గం/గుమ్మఘట్ట: రోజురోజుకూ ప్రచండభానుడు ఉగ్రరూప దాల్చడంతో ఎండవేడిమిని భరించలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామాల్లో యువకులు బావులు, చెరువుల్లో ఈతకు వెళ్తూ సేద తీరుతున్నారు. కళ్యాణదుర్గం మండలం శీబావి గ్రామ సమీపంలోని ఓ బావిలో నీరు సమృద్ధిగా ఉండటంతో యువకులు ఈత కొట్టారు. చెట్ల కొమ్మలు, బావుల పైభాగం నుంచి నీటిలోకి దూకి కేరింతలు కొట్టారు. అలాగే గుమ్మఘట్ట మండలంలోని బీటీపీ సాగునీటి కాలువ, బావుల్లోకి యువకులు ఈతకు వెళ్లి ఉక్కపోత నుంచి ఉపశమం పొందుతున్నారు. అలాగే శీతల పానీయాలు తీసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


శ్రీనివాసులు మృతదేహం

కూడేరు: వివాహ కార్యక్రమానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా చీకట్లో గుర్తు తెలియని వాహనం ఢీకొన డంతో ధర్మవరానికి చెందిన శ్రీనివాసులు(60) అనే వ్యక్తి ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలు ఇలా.. ధర్మవరానికి చెందిన శ్రీనివాసులు, ఖాజా, హుసేన్ కూడేరు మండలంలోని ఇప్పేరులో వివాహ కార్యక్రమాన్ని చూసుకుని శనివారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మండలంలోని కమ్మూరు సమీపాన అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. దీంతో శ్రీనివాసులు తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఖాజా, హుసేన్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వస్తున్న వాహనాదారులు గమనించి క్షతగాత్రులను 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కేంద్రియ విద్యాలయం సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. రాతన గ్రామానికి చెందిన రామన్న వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరాడు. కేంద్రియ విద్యాలయం సమీపానికి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో రామన్న గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

● పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2000–2001లో పాఠశాలలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు కలిశారు. అప్పటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. అప్పటి గురువులు ఈశ్వరరెడ్డి, నిర్మలను ఘనంగా సన్మానించారు. గురువులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివనాగార్జున, బాబు, శ్రీకాంత్, శ్రావణ్, దానవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గానికి వేదిక 'లోక్ అదాలత్'


మాట్లాడుతున్న పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి శంకర్‌రావు


ఉరవకొండ: కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వస్తున్న దృశ్యం


కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న మొబైల్ కోర్టు జడ్జి జె.సుజీన్ కుమార్

రాయదుర్గంటౌన్: కక్షిదారులు రాజీ మార్గంతో కేసులను పరిష్కరించుకునేందుకు అత్యుత్తమ వేదిక 'జాతీయ లోక్ అదాలత్' అని పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకర్‌రావు అన్నారు. శనివారం రాయదుర్గం కోర్టులో పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్ తదితర కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మనిషి విక్షచణ కోల్పోయి అనవసరంగా కేసుల్లో ఇరుక్కుని కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృధా చేసుకోవడంతోపాటు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో జడ్జి ఆధ్వర్యంలో రాజీమార్గంతో వివిధ రకాల 73 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సీ శ్రీనివాసన్, ఈసీ వన్నూరుస్వామి, రూరల్ సీఐ యుగంధర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: ఉరవకొండ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరమయ్యాయి. శనివారం కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకళ్యాణి ఆధ్వర్యంలో 2 సివిల్ కేసులు, బ్యాంకు కేసులు 27, పీఎస్‌సీ 16, ఎస్‌టీసీ 560, సీసీ ఐపీసీ 44 మొత్తం 649 పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా రూ.37,48,600 వసూలయింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, బ్యాంకు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: జాతీయ లోక్ అదాలత్‌లో 1,001 కేసులను పరిష్కరించినట్లు మొబైల్ కోర్టు జడ్జి జె.సుజీన్ కుమార్ తెలిపారు. స్థానిక కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా 43 ఐపీసీ కేసులు పరిష్కారం కాగా రూ.45,500 అపరాధ రుసుం వేశారు. అదేవిధంగా సెకండ్ క్లాస్ ఎస్‌టీసీ (మట్కా, జూదం, పెట్టీ తదితర కేసుల) 958 కేసులను పరిష్కరించగా రూ.1,25,010 అపరాధ రుసుం వేశారు. అదేవిధంగా ఆయా కేసుల్లో రూ.48,090 నగదును సీజ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, దేవేంద్ర, పట్టాభి, దాదాఖలందర్, వెంకటేశులు, మల్లికార్జు తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా ఇంటికి చేరుకున్న బాధితులు


బేలోడు గ్రామంలో బాధితులతో మాట్లాడుతున్న ఎపిడమాలజిస్ట్ వెంకటేశ్వర్లు

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామంలో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులందరూ శనివారం డిశార్జ్ అయ్యారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎపిడమాలజిస్ట్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎపిడమాలజిస్ట్ వేణు గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తాగునీటి సరాఫరా అవుతున్న పైప్‌లైన్ అమర్చుకున్న కొళాయిలకు మూతలు బిగించుకోవాలని సూచించారు. లేని పక్షంలో గుంతలు పూడ్చుకుని పైభాగాన కొళాయిలను ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. వైద్యశిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అప్రమత్తంగా వుండి వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజీనాయక్, రాంకిశోర్, సర్పంచ్ కోట్ల ఉమేష్, సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు రవికుమార్, ఆదిబయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శ్రేష్ట పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

బొకుగుప్ప: భారత ప్రభుత్వం శ్రేష్ట పథకం ద్వారా ఎనిమిది, పదో తరగతి చదువుతున్న షెడ్యూల్ క్యాస్ట్(ఎస్సీ) విద్యార్థులు అత్యున్నత కార్పొరేట్ కళాశాలలో చదివే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023 ప్రవేశ పరీక్షకు ఈ నెల 3న నోటిఫికేషన్ వెలువడిందన్నారు. సుమారు 3,000 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని, ఈనెల 21 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 18న హిందీ, ఇంగ్లిష్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్కూటీ నడుపుతూ స్పృహతప్పాడు..

కళ్యాణదుర్గం: మండలంలోని నారాయణపురం సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి స్కూటీ నడుపుతూ కిందపడ్డాడు. అటుగా వచ్చిన ప్రయాణికులు గమనించి కిందపడ్డ వ్యక్తిని కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. ద్విచ్ఛక్రవాహన రికార్డుల బట్టి కళ్యాణదుర్గానికి చెందిన వ్యక్తిగా స్థానికులు గుర్తించారు. వాహనం నడుపుతున్న వ్యక్తికి ఫిట్స్ రావడంతో కిందపడినట్లు తెలుస్తోంది. కాగా ప్రమాదంలో ఆయనకు ఎటువంటి గాయాలు కాలేదు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చిరుధాన్యాలు, సేంద్రియ సాగే లక్ష్యం

రాయదుర్గం: ఆధునిక పోకడలు, మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా కొత్త రకమైన జబ్బులు కొని తెచ్చుకోవాల్సి వస్తోందని ఏడీఏ లక్ష్మానాయక్ అన్నారు. శనివారం ఆయన 'సాక్షి' తో మాట్లాడారు.. వీటి నివారణకు పోషక విలువలు కలిగిన ఆహారంపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసే చిరుధాన్యాలే దివ్యఔషధమని ఆయన గుర్తుచేశారు. పంట ఉత్పత్తుల్లో దిగుబడుల కోసం ఇష్టారాజ్యంగా రసాయన ఎరువులవాడకం వల్ల రైతులు అనేక నష్టాలు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం పెరిగితేనే మానవ మనుగడకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ దిశగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా కృషి చేస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగువైపు రైతులను సమాయత్తం చేస్తున్నామన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు

కళ్యాణదుర్గం/ఉరవకొండ: కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై కళ్యాణదుర్గంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. స్థానిక టీ సర్కిల్‌లో శనివారం కాంగ్రెస్ పీసీసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి, నాయకులు తిమ్మప్ప, జియావుద్దీన్, మల్లయ్య, మాల ఎర్రిస్వామి, ఫక్రుద్దీన్, బోయనాగరాజు, కృష్ణమూర్తి, కొలిమిదాదాపీరా తదితరులు మిఠాయిలు పంచి, బాణాసంచా పేల్చారు. అలాగే ఉరవకొండలో కాంగ్రెస్ నాయకులు అబ్బాస్, సోనియా శీనా ఓబుళేసు, సుధాకర్, అమర్నాథ్ బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచారు అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.